క్లుప్తంగా

మర్యాద పూర్వక కలయిక



అప్పారావును అభినందిస్తున్న దేవన్‌రెడ్డి

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ దివ్యాంగుల విభాగం గాజువాక ఇన్‌చార్జిగా నియమితులైన యారాడ ప్రాంతానికి వెంకట అప్పారావు (యారాడ అప్పారావు) ఆదివారం గాజువాక వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు. దేవన్ రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల సమస్యలపై శ్రమించాలని,పార్టీని నమ్ముకున్న ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ధర్మాల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశ రక్షణ బీజేపీతోనే సాధ్యం

సింథియా: దేశ రక్షణకు, ప్రజలకు మెరుగైన పాలన అందించడం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ మండలాధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ ఎపిసోడ్ ను పార్టీ నాయకులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ మాట్లాడుతూ మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా ప్రధాని నరేంద్రమోదీ శాస్త్రీయ విజ్ఞానం, దేశంలోని మహిళల రక్షణ, పెరుగుతున్న ఊబకాయాన్ని ఏ విధంగా తగ్గించుకోవాలి, విద్యార్థులు పరీక్షలు ఎలా సిద్ధం కావాలో సూచించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్, కుమార్, రవి, స్వాతి బెహర, అశ్విన్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆహార పొట్లాల పంపిణీ



వృద్ధులకు భోజన పొట్లాలు, పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

సింథియా: అభాగ్యులకు ఆపన్న హస్తం అందించడంలో తృప్తి ఉంటుందని దుర్గవాని పాలెం అధ్యక్షుడు గంట్యాడ గురుమూర్తి అన్నారు. షిప్‌యార్డ్ మాజీ ఉద్యోగి యల్లబిల్లి అప్పలస్వామి వర్ధంతిని పురస్కరించుకుని ఆయన కుటుంబ సభ్యులు ఆదివారం మల్కాపురం, సింథియా, గాజువాక పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కన నివసిస్తున్న సుమారు 150 మంది అనాథలు, వృద్ధులకు భోజన పొట్లాలు, పండ్లు, పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి ములకలపల్లి ప్రకాష్, వంశీ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

జీవో నంబర్ 77 రద్దు చేయాలి



మాట్లాడుతున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య నాయకులు శేఖర్, నాగరాజు

అల్లిపురం: ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలు ముందస్తు అడ్మిషన్ల ప్రక్రియను అరికట్టాలని, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న పీజీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్‌తో పాటు ప్రైవేటు పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో నంబర్ 77ను రద్దు చేయాలని, పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్ స్కాలర్‌షిప్ విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య అధ్యక్షుడు పి.శేఖర్, జిల్లా కార్యదర్శి యు.నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు అల్లిపురం సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. విద్యార్థులను చైతన్యపరిచేందుకు విశాఖ వేదికగా మేలో విద్య, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిందని విమర్శించారు. విద్యార్థుల సమస్యలు పరిష్కరించకుండా ఇదే వైఖరి అవలంబిస్తే విద్యార్థులను చైతన్యం చేసి ఉద్యమాలకు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి హేమానంద్, మౌనిక, ఉపాధ్యక్షుడు కిరణ్, అఖి, కోశాధికారి భవాని, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

అంతా సోదరభావంతో మెలగాలి

సీతమ్మధార: ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఎంవీపీ కాలనీ సేవా కేంద్రం ప్రతినిధి బి.కె. సత్యవతి ఆధ్వర్యంలో ఆదివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం నుండి పెందుర్తి వరకు శాంతి యాత్ర నిర్వహించారు. ప్రతి ఒక్కరూ కుల మత వివక్ష లేకుండా సోదరభావంతో మెలగాలని సత్యవతి తెలిపారు. సంఘమిత్ర సోషల్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు సూరిబాబు గౌరవ అతిథిగా పాల్గొన్నారు.

ఎప్పటికి భరోసా లభిస్తుందో..



దశాబ్దాల నుంచి రేకుల షెడ్ వేసుకుని జీవనం సాగిస్తున్నాం. మా ఇంటికి రిజిస్ట్రేషన్ చేసుకుందామంటే అది పోర్టు ల్యాండ్ అంటున్నారు. ఎప్పటికి మా ఇంటి రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పిస్తారోనని ఆశగా ఎదురు చూస్తున్నాం. - కె.జానకి, మల్కాపురం

తిరుగుతున్నాం



మా ఇంటి రిజిస్ట్రేషన్ కోసం 50 ఏళ్ల నుంచి పాలకులు,అధికారుల చుట్టూ తిరుగుతున్నాం. అయినా వారు స్పందించడం లేదు. ఎన్నికల సమయంలో మీ ఇళ్లకు రిజిస్ట్రేషన్ చేయించే విధంగా చూస్తామని హామీ ఇస్తారు.అనంతరం మరుస్తారు. ఈ సారైనా మాకు హక్కులు కల్పించాలి. -కర్రి లక్ష్మి, మల్కాపురం

ఆ ప్రాంతంలో సుమారు 70 ఏళ్ల నుంచి సుమారు వంద కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. కూలి పనులు చేసుకునే వారంతా తొలుత గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తూ వచ్చారు. రూపాయి.. రూపాయి కూడబెట్టి ఇళ్లు కట్టుకున్నారు. ఉంటున్న నివాసాలకు కరెంట్ బిల్లులు,ఇంటి పన్నులు కడుతున్నారు. అయినా నేటికీ వారి ఎలాంటి హక్కులు కల్పించలేదు. తమ నివాసాలకు పక్కా రిజిస్ట్రేషన్లు చేసి భరోసా కల్పించాలని గ్రామస్తులు పాలకులు,అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. ఇప్పటికైనా క్రమబద్ధీకరించి హక్కులు కల్పించాలని వేడుకుంటున్నారు. - మల్కాపురం

పూర్వీకులు భూములు పోగొట్టుకున్నారు



మా భూములు తీసుకుని ఇక్కడ స్థలం ఇచ్చారు. నేడు ఆ స్థలం పోర్టు పరిధిలో ఉంది అంటున్నారు.ఇది చాలా దారుణం. అ లాంటప్పుడు మా వద్ద ఎందుకు స్థలాలు తీసుకున్నారు. మా స్థలం మాకు ఇప్పించండి.
-అప్పలనర్సమ్మ, మల్కాపురం

హక్కు.. చిక్కు!

70 ఏళ్లుగా నివాసం ఉంటున్నా పట్టాలకు నోచుకోని వైనం

రిజిస్ట్రేషన్లకు మోక్షం ఎప్పుడో అని నిరీక్షణ

సంపూర్ణ హక్కు కల్పించాలని మల్కాపురం వాసుల వేడుకోలు



జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం ప్రధాన మార్గానికి అనుకుని సర్వే నెంబర్ 1 లో సుమారు 29 ఎకరాల 25 సెంట్ల భూమిలో అనేక కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకుని నివాసం ఉంటున్నాయి. అయితే వీరు ఉంటున్న ఇళ్లకు నేటికీ రిజిస్ట్రేషన్లు కాలేదు.1927-28 సంవత్సరంలో మల్కాపురం గ్రామం ప్రస్తుత ఐవోసీ,హెచ్‌పీసీఎల్,ఆంధ్రస్టీల్,బీపీసీ వంటి సంస్థలు ఉన్న స్థలంలో ఉండేది.1927లో కాల్‌టెక్స్ (హెచ్‌పీసీఎల్)వంటి పరిశ్రమ రావడంతో ఆ సంస్థ ఆ స్థలాన్ని తీసుకుని 1930 -32 మధ్య నాటి బ్రిటిష్ గవర్నమెంట్ నెం78328 పేరిట 1930 నవంబర్ 11వ తేదీన ప్రస్తుతం మల్కాపురం ప్రధాన మార్గానికి అనుకుని ఉన్న 29 ఎకరాల స్థలాన్ని పునరావాసం కోసం ఇచ్చారు. అయితే నాడు



ఎమ్మెల్యే గణబాబుకు వినతి ఇస్తున్న మల్కాపురం గ్రామ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు (ఫైల్)

బ్రిటీష్ అధికారులు ఇచ్చిన ప్రస్తుత పునరావాస స్థలం పోర్టు పరిధిలో ఉందని ప్రస్తుత రెవెన్యూ రికార్డుల్లో ఉంది.ఈ కారణంగా అక్కడ ఉంటున్న నివాసీయులకు నేటికీ రిజిస్ట్రేషన్లు జరగడం లేదు. పోర్టు పరిధిలో ఉంటే మరి జీవీఎంసీ వారు ఎందుకు ఇంటి పన్నులు కట్టించుకుంటున్నారు.. విద్యుత్ అధికారులు నెల నెలా బిల్లులు వసూలు చేస్తున్నారని ఇక్కడ నివాసీయులు ప్రశ్నిస్తున్నారు. తమలాంటి పేదలకు న్యాయం చేయాలని కోరుతున్నారు. ఇదే విషయమై ఎమ్మెల్యే గణబాబుకు కూడా గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు.

త్యాగానికి బహుమతి ఇదేనా



పంట భూములు పరిశ్రమల కోసం ఇస్తే మాకు చేసిన న్యాయం ఇదా.. నాడు ప్రభుత్వం పునరావసం కోసం ఇక్కడ భూమి ఇచ్చింది. విలువైన పంట భూమి పోయినా పరిశ్రమలు వస్తే గ్రామస్తులకు ఉపాధి లభిస్తుందన్న ఆశతో ఇక్కడ వారు ఇచ్చిన 60 గజాల స్థలం తీసుకుని కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నాం. నేడు ఆ భూమి పోర్టు పరిధి అనడం ఎంత వరకు న్యాయం.దీనిపై ఏ పోరాటానికైనా సిద్ధం.
-ఉరుకూటి బాబూరావుయాదవ్, మల్కాపురం గ్రామ అభివృద్ధి కమిటీ ప్రధాన కార్యదర్శి

న్యాయం చేయండి



మా ఇంటికి రిజిస్ట్రేషన్ కాకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. ఎప్పుడు ఎవరు వచ్చి అక్కడ నుంచి వెళ్లిపోమంటారో అన్న భయం కలుగుతుంది. పరిశ్రమల కోసం నాడు భూములు తీసుకున్నారు. పోర్టు ల్యాండ్ తమకు అప్పజెప్పారు.ఇది న్యాయమా!. - బూస భారతిరెడ్డి, మల్కాపురం



చేపల మార్కెట్ వద్ద జనం

చేపలకు పెరిగిన గిరాకీ

గోపాలపట్నం: బర్డ్‌ఫ్లూ వైరస్ వల్ల మాంసాహార ప్రియులు చేపలపై పడ్డారు. మటన్ ధరలు ఎక్కువగా ఉండడంతో సరసమైన ధరలకు జిహ్వ చాపల్యం తీర్చే విధంగా ఉంటుందని వీరు రూటు మార్చారు. అయితే చికెన్ తినవచ్చునని.. బర్డ్‌ఫ్లూ ప్రభావం మన ప్రాంతాల్లో లేదని అధికారులు చెబుతున్నా ప్రజలు విశ్వసించడం లేదు. కొన్నాళ్ల పాటు చికెన్‌కు స్వస్తి చెప్పి చేపలను ఆదరిస్తే మంచిదికదా అంటూ చేపల మార్కెట్‌కు దారితీస్తున్నారు. దీంత గోపాలపట్నం చేపల మార్కెట్‌కు సాధారణ రద్దీ కంటే అధికంగా వినియోగదారులు పోటెత్తారు. చికెన్‌కు పట్టిన వైరస్ వల్ల మాకు గిరాకీ పెరిగిందని చేపల వ్యాపారస్తులు, దీనిపై ఆధారపడేవారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మహిళలు ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొవాలి



కార్యక్రమంలో పాల్గొన్న తూర్పు నౌకాదళ కెప్టెన్ రాజారవి సనత్‌కుమార్

మల్కాపురం: చదువుకున్న అమ్మాయిలు ఏ సమస్యనైనా ధైర్యంగా ఎదుర్కొవాలని తూర్పు నౌకాదళ కెప్టెన్ రాజారవి సనత్‌కుమార్ అన్నారు. మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో ఆదివారం సీనియర్ విద్యార్థినుల వీడ్కోలు కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రతి మహిళ జీవితంలో అత్యున్నత లక్ష్యాలు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ మేనేజర్ ఎస్.ఉమామహేశ్వరరావు, పోలా శ్రీనివాస్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థినులు చేసిన వివిధ నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి.

కన్నబాబుకు ఘన సత్కారం



కురసాల కన్నబాబును సత్కరిస్తున్న పార్టీ నాయకులు



కన్నబాబును సత్కరిస్తున్న పీవీ సురేష్, అనిల్‌కుమార్

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబు తొలిసారి మద్దిలపాలెంలోని పార్టీ జిల్లా కార్యాలయాన్ని ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త మళ్ల విజయప్రసాద్ సమక్షంలో ఆయన్ను పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దొడ్డి కిరణ్ తదితరులు ఘనంగా సత్కరించారు.

మల్కాపురం: వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ కురసాల కన్నబాబును ఆదివారం 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, వైఎస్సార్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాయపురెడ్డి అనిల్‌కుమార్ నగరంలోని పార్టీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

చికెన్ ఫ్రై.. ఎగ్ ఫ్రై ఫ్రీ..ఫ్రీ

మల్కాపురం: వీకెండ్ వస్తే మెనూలో నాన్‌వెజ్ ఉండాల్సిందే.. అయితే బర్డ్‌ఫ్లూ భయంతో ప్రజలు చికెన్, గుడ్లు తినడానికి భయపడుతున్నారు. బాగా ఉడికించిన చికెన్ తినడం వల్ల హాని ఉండదని పౌల్ట్రీల నిర్వాహకులు చెబుతున్నా ప్రజలు ఇష్టం చూపడం లేదు. దీంతో చికెన్, ఎగ్ తిన్నా ఎలాంటి భయం ఉండదని చెప్పే ప్రయత్నంలో భాగంగా వ్యాపారులు పలు రద్దీ సెంటర్లలో ఉచితంగా చికెన్, ఎగ్ ఫ్రై పంచుతున్నారు. ఇలా ఆదివారం జీవీఎంసీ 58వ వార్డు కోరమాండల్ సమీపంలో పంపిణీ చేశారు. ఆ దారిన పోయే వారు లొట్టలు వేసుకుంటూ హాయిగా చికెన్,ఎగ్‌లను ఆరగించారు. బర్డ్‌ఫ్లూ ప్రస్తుతం మన ప్రాంతంలో లేదని, అపోహలు వద్దు అని నిర్వాహకులు తెలిపారు. నిర్వాహకులతో పాటు 60వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ పి.వి.సురేష్, మారుతీ చికెన్ సెంటర్ యజమాని శ్రీనివాసరాజు పాదచారులకు చికెన్ ఫ్రై పంపిణీ చేశారు. అపోహ వీడాలన్నారు.

ప్రశాంతంగా గ్రూప్-2 పరీక్షలు



ఉరుకులు పరుగులతో వెళుతున్న అభ్యర్థులు



అనుమతించక పోవడంతో నిరాశగా అభ్యర్థి



పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న అభ్యర్థులు

గోపాలపట్నం: గ్రూప్-2 పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. గోపాలపట్నం బాలాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాల కేంద్రంగా పరీక్షలు నిర్వహించారు. ఉదయం 8.30 గంటల నుంచే అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఈ సెంటర్‌లో పేపర్-1 ఉదయం 10 గంటలకు ప్రారంభమయింది. మధ్యాహ్నం 12.30కి ముగిసింది. ఇందులో 600 మందికి గాను 518 మంది అభ్యర్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షల్లో 600 మందికి గాను 517 మంది హాజరయ్యారు. కాగా కొంత మంది ఆలస్యం కావడంతో ఉరుకులు పరుగులతో పరీక్షా కేంద్రానికి చేరుకున్నారు. సమయం దాటిన తర్వాత వచ్చిన ఒక అభ్యర్థిని తిరిగి వెనక్కి పంపించారు.

ముగిసిన 'శ్రీమహాగణపతికి లక్ష మోదక యజ్ఞం'

ఎంవీపీకాలనీ: ఈ నెల 15 నుంచి జరుగుతున్న 'శ్రీమహాగణపతికి లక్ష మోదక యజ్ఞం' ప్రవచనాల కార్యక్రమం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా శ్రీ మహాగణపతి వైభవంపై బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. రుషి పీఠం సత్సంగం శాఖ ఆధ్వర్యంలో ఎంవీపీ కాలనీ సెక్టార్-6లోని భద్రం పార్క్ వేదికగా ఈ కార్యక్రమం నిర్వహించారు. ముగింపు సందర్భంగా షణ్ముఖశర్మ మాట్లాడుతూ దేహంలోని జీవుడి చైతన్యమే అనంత విశ్వమంతా వ్యాపించిన పరతత్వ స్వరూపం మహాగణపతేనన్నారు. సర్వ విద్యాప్రదాత గణపతిని ధ్యానించినా.. ఆరాధించినా సర్వశుభాలను అందిస్తారన్నారు. అంతరంగ దర్శనంతో మాత్రమే ఆధ్యాత్మిక చైతన్యం సిద్ధిస్తుందని చెప్పారు. అనంతరం మహాగణపతి విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఎక్కిరాల కృష్ణమాచార్య, సద్గురు శివానందమూర్తి,



ప్రవచిస్తున్న షణ్ముఖశర్మ

అప్పలాచార్య వంటి మహనీయులు నడిచిన నేల విశాఖలో తాను ప్రవచనాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆయనను నిర్వాహకులు, ఆధ్యాత్మిక వేత్తలు ఘనంగా సత్కరించారు. నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కార్యక్రమంలో నిర్వాహకులు కె.వి.ఎస్.శ్యామ్, కందాళ అరుణ గాయత్రి, డి.శ్రీనివాస్, వి.వి.ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా నిత్యకల్యాణం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఆదివారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణమండపంలో వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కార్యక్రమాన్ని నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేష వస్త్రాలు అందించారు.

కనులపండువగా శ్రీరామ పట్టాభిషేకం



పూజల్లో పాల్గొన్న భక్తులు

మురళీనగర్ : మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్కు వేములపల్లి కళాక్షేత్రంలో శ్రీరామ పట్టాభిషేకం ఉత్సవాన్ని ఆదివారం కనులపండువగా నిర్వహించారు. ఎన్నడూ లేనంతగా భారీ ఎత్తున ఈ ఆధ్యాత్మిక కార్యక్రమాన్ని నిర్వహించారు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్ తవాస్మిదాస బృందం, శ్రీవారి సేవా సమితి, వైశాఖి స్పోర్ట్స్ పార్కు సంయుక్తంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించారు. పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, పీవీఎస్ఎన్ రాజు పర్యవేక్షణలో ఉత్సవాన్ని నిర్వహించారు. డాక్టర్ జీఆర్‌కే ప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఉదయం 8.30 గంటలకు కోలాటం, చిన్నారుల భరతనాట్యంతో వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వేదికపై సీతారాముల విగ్రహాలను ఆశీనులను గావించి పట్టాభిషేక ఉత్సవం నిర్వహించారు. ఉత్సవంలో దంపతులు పాల్గొని శ్రీరాముడికి అష్టోత్తర నామావళి పూజ, సీతమ్మవారికి కుంకుమ పూజ, ఆంజనేయస్వామికి 108 తమలపాకుల పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో సురేష్‌బాబా ప్రత్యేక చర్యలు చేపట్టారు. దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ, ప్రసాద్, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యుల సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

వైభవంగా బంగారమ్మతల్లి తీర్థమహోత్సవం



బంగారమ్మతల్లి



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

సింహాచలం: అడవివరం గ్రామదేవత, శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి సోదరి బంగారమ్మతల్లి తీర్థ మహోత్సవం(పరస) ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు అమ్మవారికి చీరలు, పసుపు కుంకుమలు సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద భక్తులకు సింహాచలం దేవస్థానం పులిహోర ప్రసాదాన్ని అందించింది. ఆలయానికి విద్యుద్దీపాలంకరణ చేసింది. దేవస్థానం ట్రస్ట్‌బోర్డు మాజీ సభ్యుడు గంట్ల శ్రీనుబాబు అమ్మవారిని దర్శించుకుని పూజలు జరిపారు. స్థానికులు తోట చంద్రరావు ఆధ్వర్యంలో మధ్యాహ్నం ఆలయం వద్ద పెద్ద ఎత్తున అన్న సమారాధన, సాయంత్రం లడ్డూ ప్రసాద వితరణ చేశారు. గ్రామస్తులు విశేషంగా తరలివచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. బంగారుతల్లి యూత్ ఫ్రెండ్స్ అక్రమంతి ప్రసాద్, తోట రజని, శ్రీధర్ తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విశ్వంతో విడదీయరాని బంధం



పుస్తకం ఆవిష్కరిస్తున్న నల్లమోతు రాధాకృష్ణ

సీతంపేట : విశ్వ నియమాలను అవగాహన చేసుకోవడం ద్వారా ప్రజలు స్వేచ్ఛను అనుభవిస్తారని భారత హేతువాద సంఘం ప్రధాన కార్యదర్శి మేడూరి సత్యనారాయణ అన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల ప్రాంతీయ హేతువాద సంఘం మహాసభ ఆదివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విశ్వతత్వం, పరిణామం అంశంపై ప్రసంగించారు. విశ్వం ఆది అంతాలు లేనిదని, మానవుడు విశ్వంలో విడదీయలేని అంతర్భాగమన్నారు. పరస్పర సహకారంతో మానవాభివృద్ధి సాధ్యమన్నారు. వైజ్ఞానిక వికాసం పెరగాలని సూచించారు. గుమ్మా వీరన్న రచించిన 'హేతువాద మానవవాద తత్వవేత్త రావుపూడి వెంకటాద్రి' పుస్తకాన్ని రాడికల్ హ్యూమనిస్ట్ సెంటర్ కోశాధికారి నల్లమోతు రాధాకృష్ణ ఆవిష్కరించి సమీక్షించారు. అనంతరం ఆర్.జగపతి రాజును సంఘం నూతన అధ్యక్షునిగా, ఎస్.పాండురంగారావును ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కాజ రాజశేఖర్, రాంప్రభు, షేక్ దరియావలి, తదితరులు పాల్గొన్నారు.